ఆ పెళ్ళిమండపంలోంచి ఎంత తొందరగా బయటపడదామా అనే ఆలోచనలో ఉంది రత్నమాల.

సెంట్లు, మల్లెపూలవాసనలతో ఆ వాతావరణం గుభాళిస్తున్నా రత్నమాలకు మాత్రం చిరాగ్గా ఉంది. చాలామంది ఆమెను పరిశీలనగా చూసి వెళ్లిపోతున్నారు. కొంతమంది యక్షప్రశ్నలు వేస్తున్నారు. అందరూ బంధువులు, పరిచయస్తులూ కావడంతో వారి మాటలను మౌనంగా భరిస్తోంది.

అరగంటక్రితమే డిగ్రీలో తన క్లాస్‌మేట్ ఒకామె వచ్చింది. ఆమెకు ఐదేళ్ళ కూతురు, రెండేళ్ళ కొడుకు. "నీకు గనక పెళ్ళయిఉంటే నాలా ఇద్దరిని కనేదానివి" అంటూ వెటకారం



# అందం

గా మాట్లాడివెళ్ళింది.

ఇంకొక స్నేహితురాలు "ఇంకెంతకాలం వేచిచూస్తావ్? నీ కలల రాకుమారుడు ఎప్పుడు ప్రత్యక్షం అయ్యేను?" అంటూ వెళ్లిపోయింది.

వారి మాటలకు రత్నమాలకు ఏడుపొస్తోంది. ఇంతలో "నమస్కారం అమ్మా" అంటూ పలకరింపు వినిపించి తలెత్తింది.

ఎదురుగా ఇద్దరు దంపతులు. 'ఆవిడ వయస్సు యాభై దాటి ఉంటుంది. ఆయనకు అరవై ఉంటుందేమో!' అనుకుంది. వాళ్ళెవరో ఆమెకు గుర్తుకురాలేదు. వారివంక ప్రశ్నార్థకంగా చూసింది.

"అమ్మా... నువ్వు మాకు బాగా కావలసిన దానివి. ఒకసారి మా ఇంటికి రా!" అంటూ కాగితంమీద అడ్రసు రాసిచ్చాడు ఆయన. ఆ కాగితం తీసుకుని తన బ్యాగ్‌లో వేసుకొంది. అరగంట తర్వాత మంగళసూత్రధారణ అయిపోగానే పెళ్ళిమండపంనుంచి బయటపడింది.

★ ★ ★

ఇంటికి వెళ్ళగానే రత్నమాల తల్లితో "నన్ను అనవసరంగా పెళ్ళికి వెళ్ళమన్నావ్, తీరా వెళితే అవమానం. పెళ్ళి చేసుకోకపోవడం ఒక నేరంగా కనిపిస్తోంది" అంది కోపంగా.

"ఔనమ్మా. లోకం అలాగే వుంది. ఎన్ని సంబంధాలు వచ్చినా నీకు నచ్చలేదు. పొట్టిగా వున్నాడని, నల్లగా ఉన్నాడని ఇలా ఏ ఒక్కరూ నచ్చలేదు. చివరికి ఏమయింది? ముప్పయ్యేళ్ళు నెత్తిమీదికొచ్చాయి, నీ పెళ్ళి కాలేదనే దిగులుతోనే చచ్చిపోయేలా ఉన్నాను" తల్లి కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

తల్లి మాటలకు రత్నమాల బాధపడుతూ 'ఔను... తనకు ఈ అవమానం జరగాల్సిందే! తనను కాలేజీలో 'మిస్ బ్యూటీ' అనేవారు. తన కళ్ళు నెత్తిమీదికొచ్చాయి. తనకి ఎవరూ నచ్చేవారుకాదు. అందమైన వాడికోసం ఎదురుచూసేసరికి ఐదేళ్ళు గడిచిపోయాయి. ఇక ఈ పిల్లకు పెళ్ళికాదు అనే తీర్మానానికి వచ్చేసారు. గుడ్డిలో మెల్లగా ఏదో ఉద్యోగం ఉండడంతో టైమ్ గడిచిపోతుంది. అలా అనుకుంటూ సమాధానపడింది రత్నమాల.

★ ★ ★

తర్వాతరోజు ఆఫీస్ అయినతర్వాత బైక్ తీద్దామని బ్యాగ్‌లో తాళం కోసం వెదికింది. ముందురోజు పెళ్ళిలో తనను కలిసి, ఇంటికి ఆహ్వానిస్తూ ఆ పెద్దాయన ఇచ్చిన అడ్రసుకాగితం కనిపించింది. ఆమె ఆలోచనలో పడింది.

'వాళ్ళింటికి ఎందుకు రమ్మన్నట్టు?! కొంపదీసి పెళ్ళి సంబంధమా? ఒకసారి వెళితే ఆ పెద్దాయన పుణ్యమా అని వాళ్ళు చూపించే సంబంధం ఖాయమయితే తను నలుగురినోళ్ళల్లో నానే బాధ తప్పుతుంది' అనుకుంటూ ఆ అడ్రసు ప్రకారం బయలుదేరింది. ఆఫీసుకు దగ్గరలోనే ఉంది కొత్తగా కట్టిన డాబా ఇల్లు. సంశయిస్తూనే ఇంటి తలుపుకొట్టింది. ఆ రోజు కలిసిన పెద్దాయన తలుపు తీసాడు. ఆమె ను చూడగానే అతడి ముఖంలో ఆనందం. "రండమ్మా!" అంటూ లోపలికి తీసుకెళ్ళాడు. సోఫాలో కూర్చుంది.

డాక్టర్ ఎమ్. సుగుణరావు

"శారదా! అమ్మాయొచ్చింది" అన్నాడు గట్టిగా. ఆవిడ గబగబా వచ్చి, "బావున్నావా అమ్మా... నువ్వు రావడం చాలా సంతోషం." అంటూ మళ్ళీ లోపలికివెళ్ళి టిఫిన్ ప్లేటుతో తిరిగొచ్చింది. రత్నమాలకు మొహమాటంగా ఉంది. తనకు వీరితో పరిచయం లేదు. అయినా చాలా ఆప్యాయంగా మాట్లాడుతున్నారు. అసలు తననుంచి వీళ్ళేమి ఆశిస్తున్నారు? తను ఊహిస్తున్నట్టుగా పెళ్ళి సంబంధమేనా? రత్నమాలలో పరిపరివిధాలయిన ఆలోచనలు.

ఆ రూమ్‌వంక పరిశీలనగా చూసింది. టీవి, ఫ్రిజ్, విసిడి, ఖరీదయిన విదేశీ బొమ్మలు. అన్నీ పొందికగా సర్దివున్నాయి. ఆ బొమ్మల్ని చూస్తూ వాటిప్రక్కనే ఉంచిన ఫొటోఫ్రేమ్‌కేసి చూసి ఆగిపోయింది. అది నూతన దంపతుల పెళ్ళిఫొటో. ఆ ఫొటోలోని పెళ్ళికొడుకునిచూసి ఆమె గతుక్కుమంది. సంవత్సరం క్రితం తాంబూలాలవరకూ వచ్చి తను తిరస్కరించిన పెళ్ళికొడుకు అతనే. ఆ విషయమంతా గుర్తొచ్చింది రత్నమాలకు.

అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న పెళ్ళికొడుకు ఫొటో చూపించారు. బాగానే ఉన్నాడు ఫొటోలో అనుకుని పెళ్ళికి ఒప్పుకుంది. వారంరోజుల్లో పెళ్ళి అనగా అతను ఇండియా వచ్చాడు. అప్పుడు చూసిందతన్ని. అంతే! షాక్‌గా అనిపించింది. మనిషి నలుపు. జుట్టు బాగా తెల్లబడింది. ముఖంలో స్ఫోటకం వచ్చిన గుర్తుగా మచ్చలు. ఫొటోలోని వ్యక్తితో పోలికే లేదు.

'ఇన్ని సంవత్సరాలు వేచి చూసి ఇలాంటి వాడితోనా పెళ్ళి? అంటూ తను ఏడ్చింది. ఇంట్లో అంతా ఒప్పించడానికి చూసారు. బలవంతం చేస్తే ఆత్మహత్య చేసుకుంటాననడంతో ఆ పెళ్ళి తప్పిపోయింది. బంగారంలాంటి సంబంధం తప్పిపోయిందని తనను అందరూ తిట్టారు.

ఆ విషయం గుర్తుకొచ్చి నిట్టూర్పు విడిచింది రత్నమాల.

"అమ్మా! నువ్ చూస్తున్న ఆ ఫొటోలోని అమ్మాయి నా కూతురు. నువ్వు ఏమీ అనుకోకపోతే నేనొక విషయం చెపుతాను.." అన్నాడు ఆమె ఆలోచనలకు అడ్డొస్తూ.

"ఫరవాలేదు చెప్పండి" అందామె.

"నువ్వు కాదనడంవల్లే దేవుడులాంటివాడు నాకు అల్లుడిగా దొరికాడు. ఇలా అనడం భావ్యం కాదు. అయినా మనసులోని మాట చెబుతున్నాను" అంటూ ఆయన చేతులు జోడించాడు.

రత్నమాలకు ఇబ్బందిగా అనిపించింది. ఆయన కొనసాగించాడు.

"నా అల్లుడు దేవుడమ్మా. కట్నం తీసుకోకుండానే పెళ్ళి చేసుకున్నాడు. మేం ఇల్లు కట్టుకోవడానికి సాయం చేసాడు. ఈ ఇంట్లో విలువైన సామానన్నీ ఆయన కొన్నవే!" అతడు చెప్పుకుపోతున్నాడు. రత్నమాల మరి వినలేకపోయింది.


"ఇక నేను వెళ్ళొస్తానండీ!" అంది

"ఉండమ్మా... నా అల్లుడూ, కూతురూ అమెరికా నుంచొచ్చారు. షాపింగ్‌కి వెళ్ళారు. కొంచెంసేపు కూర్చోమ్మా...!" అన్నాడు.

రత్నమాలకు ఇక ఒక్క క్షణం కూడా అక్కడ ఉండాలనిపించలేదు.

"నేను వెళ్ళాలి... పనుంది..." అంటూ లేచింది.

"ఉండమ్మా ... ఒక్క క్షణం" అంటూ లోపలకు వెళ్ళి ఒక ప్యాకెట్‌తో బైటకొచ్చింది. బొమ్మ




పెట్టి ఆ ప్యాకెట్‌లోని చీర, జాకెట్ రత్నమాలకు అందించింది. "ఎందుకండీ ఇవన్నీ..." అంది రత్నమాల మొహమాటపడుతూ.

"మా కూతురిలాంటి దానివమ్మా.." అన్నారు ఆ దంపతులు. ఆమె ఇద్దరికీ నమస్కరించి గబగబా బైటకు నడిచింది.

రత్నమాల బైక్ స్టార్ట్ చేసేసరికి ఆ ఇంటి ముందు టాక్సీ వచ్చి ఆగింది. బహుశా కూతురూ అల్లుడూ వచ్చి ఉంటారు అనుకుంటూ వేగంగా బండి తీసి ఆ ఇంటికి కొద్ది దూరంలో నిలుచుంది. ఆమెలో ఉత్సుకత... 'అమ్మాయి ఫొటోలో బావుంది. బైట ఎలా ఉంటుందో!' అనుకుంటూ చూస్తూ నిలుచుంది.

టాక్సీలోంచి అతను దిగాడు. ఆమెను చూసింది. ఇంకా టాక్సీలోనే కూర్చుని ఉంది. 'చాలా బావుంది. తెల్లటి తెలుపు, కన్ను ముక్కు తీరు చక్కగా ఉంది' అనుకుంది. అతను ఆమె చెయ్యిపట్టుకున్నాడు. కొత్త పెళ్ళికూతురు చెయ్యి వదలదేం? అనుకుంది. అతను ఆమె భుజాల మీద తన చేతులుంచాడు.

"ఇదేమి విడ్డూరం... అమెరికా పెళ్ళికొడుకు ఆమెను ఎత్తుకుని తీసుకువస్తాడా?" అనుకుంది. ఇంతలో రత్నమాలను ఆశ్చర్యంలో పడేసే సంఘటన... ఆమెను కారులోంచి మెల్లగా బైటకు తీసుకొచ్చాడు. ఆమె కుంటుతూ నడుస్తోంది. "అయ్యో, చిన్నప్పుడే పోలియో వచ్చి వుంటుంది" అనుకుందామె. ఆమెను చూసిన రత్నమాలకు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆ అమ్మాయిని చూస్తూ ఆలోచనల్లో పడింది రత్నమాల.

'ఆ పెద్దాయన చెప్పినట్టు ఈ వికలాంగురాలిని పెళ్ళిచేసుకున్న పెళ్ళికొడుకు నిజంగా దేవుడే. ఇతడినా తను తిరస్కరించింది? అతడి బాహ్యసౌందర్యాన్ని మాత్రమే తను చూసింది. అతడిలోని ఆత్మసౌందర్యాన్ని గ్రహించలేకపోయింది. అందం మనిషిలో వుండదు... మనసులో వుంటుంది' అనుకుంటూ ముందుకు సాగింది రత్నమాల. ●